## నేడు ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కల్వకుర్తి రూరల్, అక్టోబర్17: కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో బుధవారం నూతనంగా నిర్మించనున్న వరసిద్ధి వినాయక ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు కాలనీవాసులు మంగళవారం పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11గంటలకు ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- కల్వకుర్తి మున్సిఫ్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి



అవార్డులను అందజేస్తున్న న్యాయమూర్తి శ్రీదేవి, ఎంవీఐ రాంబాబు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్17: ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరవేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు తమవంతు కృషి చేయాలని కల్వకుర్తి మున్సిఫ్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ ఆర్టీసీ డిపోలో డీఎం శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రమాదరహిత అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి శ్రీదేవి, ఎంవీఐ రాంబాబు హాజరై సెప్టెంబర్‌లోఉత్తమ ప్రతిభను కనబర్చిన ఉద్యోగులకు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రమాదరహిత డిపోగా కల్వకుర్తిని తీర్చిదిద్దాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించి ఆర్టీసీపైన మరింత నమ్మకాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

## శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మండల పశువైద్యాధికారి శ్యాంసుందర్




మందులు అందజేస్తున్న పశువైద్యాధికారి

వెల్దండ అక్టోబర్ 17: ప్రభుత్వం పశువుల సంరక్షణ కోసం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశుసంవర్ధక శాఖ అధికారి శ్యాంసుందర్ పేర్కొన్నారు. మంగళవారం వెల్దండ మండలం బర్కత్‌పల్లిలో ఏర్పాటు చేసిన పశువైద్యశిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశవ్యాధి నివారణ, ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేసినట్లు డాక్టర్ తెలిపారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది నరేశ్‌రెడ్డి, వెంకన్న రైతులు తదితరులు ఉన్నారు.

## పనులపై నిర్లక్ష్యం వహించొద్దు

చారకొండ, అక్టోబర్ 17: గ్రామాల్లో చేపడుతున్న పనులపై నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీవో వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లిలో నర్సరీ, పల్లెప్రకృతి వనం, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాదికి గ్రామాల్లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటుటకు నర్సరీలను సిద్ధం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేపట్టి, వీధులను శుభ్రంగా ఉంచాలని చెప్పారు. జీపీ రికార్డులతోపాటు ఉపాధిహామీ పథకానికి సంబంధించిన ఏడు రికార్డులు విధిగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ, టీఏ అల్లాజీ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో వెంకటేశ్

# జగజ్జననీ.. పాహిమాం

- అన్నపూర్ణాదేవీగా అలంకరణ
- భక్తులకు దర్శనమిచ్చిన వాసవీమాత
- కనులపండువగా దేవీనవరాత్రోత్సవాలు



కల్వకుర్తి వాసవీమాత ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు

కల్వకుర్తి, అక్టోబర్ 17: దసరా పండుగను పురస్కరించుకొని శక్తిగా పూజించే దేవీశరన్నవరాత్సోవాలు కనులపండువగా జరుగుతున్నాయి. జగజ్జనని అమ్మవారు శక్తిరూపాలతో భక్తులకు దర్శనమిస్తున్నారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వాసవీమాత అన్నపూర్ణాదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే వాసవీమాతను సుప్రభాతంలో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాసవీమాతను అన్నపూర్ణాదేవీగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఉత్సవ కమిటీ, ఆలయ ట్రస్టీ ఆధ్వర్యంలో వెల్‌బేబీషో నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం భక్తిరస సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు బతుకమ్మలు ఆడారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రమేశ్‌బాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేశ్, జగదీశ్వర్, శ్రీధర్, ఉత్సవ కమిటీ బృందం అశోక్, రాఘవేందర్, శ్రీను, కోటేశ్వర్, శ్రీనివాస్, ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో అన్నపూర్ణాదేవీ అలంకరణతో వాసవీమాత



కల్వకుర్తిలోని పెద్దమ్మతల్లి యూత్ వద్ద అన్నపూర్ణ దేవీ అలంకరణలో అమ్మవారు



చారకొండలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

### కల్వకుర్తి మండలంలో..

కల్వకుర్తి రూరల్, అక్టోబర్17: కల్వకుర్తి మండలంలోని మార్చాల, తర్నికల్, కుర్మిద్ద, జీడిపల్లి, గుండూర్, లింగసానిపల్లితోపాటు కల్వకుర్తి పట్టణంలోని పెద్దమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి మండపాల వద్ద దేవీ శరన్నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణ మాత అలంకరణలో దర్శనమిచ్చారు. తర్నికల్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కల్వకుర్తికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రవీందర్ రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల సందర్భందగా గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవ మండలీల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేకంగా మండపాలను ఏర్పా టు చేసి శోభాయమానంగా అలంకరించారు. సాయంత్రం వేళ అమ్మవారి మండపాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని బతుకమ్మ కోలాటం వేస్తూ సందడి చేస్తున్నారు.

### వెల్దండ మండలంలో..

వెల్దండ, అక్టోబర్ 17: మండల కేంద్రంలోని బుధార్‌పేట ఆంజనేయ స్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన అమ్మవారు అన్నపూర్ణ మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి వెల్దండ మాజీ ఎంపీటీసీ చిందం కృష్ణయ్య, విజేందర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అమ్మవారి శరన్నావరాత్రి ఉత్సవాల సందర్భంగా కొలువుదీరిన అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు వజ్రలింగం, రమేశ్, శ్రీను, కుమారస్వామి, సంతోష్, సైదులు, కిరణ్, ఆంజనేయులు, రాజయ్య, శ్రీను, కృష్ణ, అనిల్, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### వంగూరు మండలంలో..

వంగూరు, అక్టోబర్ 17: మండలంలోని కోనాపూర్‌లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద మంగళవారం గ్రామానికి చెందిన కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అచ్చంపేట ఎమ్మెల్యేగా తిరిగి విప్ గువ్వల బాలరాజు మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిచి మంత్రి పదవి పొందాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుఖజీవన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

### అమ్మవారికి ప్రత్యేక పూజలు

చారకొండ, అక్టోబర్ 17: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు జూపల్లి, తిమ్మాయిపల్లిల్లో ప్రత్యేక మండపం వద్ద కొలువుదీరిన దుర్గామాతకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండపాల వద్ద మహిళలు కోలాటం, బతుకమ్మ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కోనాపూర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న రాజేందర్‌రెడ్డి దంపతులు



బుధార్‌పేటలో అమ్మవారికి పూజలు చేస్తున్న నాయకులు, భక్తులు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఊర్కొండ, అక్టోబర్ 17: మండలంలోని బొమ్మరాజుపల్లిలో తాడెం రాములయ్య మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ, కరాటే అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డికి గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటేశ్ తెలిపారు. దీంతో జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ తక్షణ సాయం కింద రూ.5వేలు పంపించారు. అలాగే ఎంపీటీసీ గోపాల్‌గుప్తా రూ.3వేలు, సర్పంచ్ బోయ లక్ష్మమ్మ రూ.2వేలు బాధిత కుటుంబానికి అదజేశారు. అదేవిధంగా ఊర్కొండ మండలకేంద్రంలో చాకలి వెంకటమ్మ మృతిచెందగా.. బాధిత కుటుంబానికి ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి రూ.5వేలు, ఊర్కొండ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము రాజయ్య రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు